Dr. K.V.P. Ramachandra Rao
MEMBER OF PARLIAMENT
(RAJYA SABHA)

सत्यमेव जयते

#10, Lodhi Estate
New Delhi - 110 003
Ph : 011 - 24644656
Fax: 011 - 24642528

**ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి కి బహిరంగ లేఖ**

**విభజన చట్ట అమలుకు - జల్లికట్టు స్ఫూర్తి గా కదులుదాం రండి**

తేదీ:21.01.2017

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారికి,

ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్ళు. ప్రజాభిప్రాయాన్ని ఎవరైనా గౌరవించవలసినదే. **ప్రజాభిప్రాయం ముందు ఎవరైనా తలవంచవలసినదే. ఇది చిరకాలంగా మనమంతా వింటున్న మాటే అయినా మన తమిళ సోదరులు పార్టీలు, కులాలు,మతాలు, వర్గాలు, ప్రాంతాలు, వృత్తులకు అతీతంగా ఏకమయ్యి - దీన్ని నిరూపించిన విధాన్ని** ఒక్క సారి చూడండి. తమ సంప్రదాయాన్ని నిలబెట్టుకోవడానికి - మన దేశ అత్యున్నత న్యాయస్థానం జల్లికట్టులో పశువుల వాడకాన్ని నిషేధిస్తూ ఇచ్చిన తీర్పు అమలులో ఉండగానే - జల్లికట్టును అనుమతించేలా కేంద్ర ప్రభుత్వం పై వత్తిడి చేసి ఆర్డినెన్సు ను తెచ్చుకొన్న విధానాన్ని ఒక్క సారి పరిశీలించండి. మళ్ళీ జల్లికట్టు ను అనుమతించే విషయం ప్రస్తుతం ఉన్నత న్యాయ స్థానం పరిశీలనలో ఉన్నందున - ఈ విషయం సబ్-జుడిస్ అనే తప్పిచుకొనే అవకాశం కేంద్రానికి ఉన్నా, కేంద్రం మెడలు వంచి ఉత్తర్వులు తెచ్చుకొన్న విషయం ఒకసారి పరికించండి.

**వారు మూడు రోజులలో సాధించింది మనం మూడేళ్లు అయినా విభజన చట్ట అమలు విషయంలో ఎందుకు సాధించ లేకపోతున్నాము? మనం ఏమైనా గొంతెమ్మ కోరికలు కోరుతున్నామా? మనకు న్యాయం గా రావలసినవి ఇవ్వవలసిన బాధ్యత కేంద్రం పై లేదా? మనలో ఐకమత్యం లేదా? మనకు చిత్తశుద్ధి లేదా? మరి మనం మూడేళ్ళుగా ఎందుకు మనకు రావలసినవాటి గురించి కేంద్రం పై వత్తిడి తేకుండా - వారు విదిల్చినవి మాత్రమే తీసుకొంటున్నాము? ఒక సారి రాష్ట్ర ముఖ్యమంత్రి గా ఆలోచించండి.**

విభజన జరిగి మూడేళ్లు పూర్తి అవుతున్నాయి. విభజనను ఏ సీమాంధ్రుడు కోరుకోలేదు. విభజన వలన మాకు జరిగిన అన్యాయానికి ప్రత్యామ్నాయంగా మాకు ఇవి ఇవ్వండి అని ఏ సీమాంధ్రుడు అడుగలేదు. అప్పటి కేంద్ర ప్రభుత్వమే విభనవల్ల సీమాంధ్ర కు నష్టం జరుగుతున్నదని పార్లమెంట్ సాక్షిగా తెలిపింది. సీమాంధ్ర కు జరుగుతున్న అన్యాయాన్ని సరి దిద్దడానికి కొన్ని అంశాలను చట్టంలో చేర్చింది. హడావుడి విభజన వల్ల కొన్ని అంశాలను చట్టంలో చేర్చలేక - పార్లమెంట్ సాక్షిగా హామీలుగా ఇచ్చింది. అప్పటి ప్రతిపక్షం ఈ దిద్దుబాటు చర్యలు చాలవు అంటూ సీమాంధ్రను మిగతా రాష్ట్రాలతో సమానం గా నిలబెట్టడానికి - ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయని - ఇవి అప్పటి కేంద్రం ప్రభుత్వం చేయనందువల్ల - అధికారంలోకి రాగానే మేమే చేస్తామని పార్లమెంట్ సాక్షి గా ప్రకటించింది. సీమాంధ్ర - హైదరాబాద్ ను కోల్పోతున్నందుకు - 4 లక్షల కోట్ల ప్యాకేజి ఇవ్వాలని మీరూ డిమాండ్ చేశారు. విభజన సందర్భంగా సీమాంధ్ర కు జరిగిన అన్యాయంపై అప్పుడు గళమెత్తిన ప్రతిపక్షం ఇప్పుడు అధికారం లో ఉన్నది. అయినప్పటికీ వాస్తవం గా జరిగిందేమిటి? **మూడేళ్ళలో మనం సాధించింది ఏమిటి- ఒకసారి పరిశీలిస్తే చాలా బాధ కలుగుతున్నది.**

**విభజన నష్టానికి ప్రత్యామ్నాయంగా కేంద్రం ఇస్తానన్న ఈ క్రింది విషయాలలో మనం సాధించిందేమిటి?**

**(1) సీమాంధ్ర కు సంజీవని అవడంతో పాటు, సీమాంధ్ర యువతకు అసంఖ్యాక ఉద్యోగాలు కల్పించగల "ప్రత్యేక హోదా" విషయంలో గాని, (2) ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధి కి ఊతం కాగల వైజాగ్ రైల్వే జోన్ విషయంలో గాని, (3) వెనుకబాటు తనంతో**

H.No. 8-2-544/101, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034. Ph : 040 - 23357513.
email : kvprrao@yahoo.com

Dr. K.V.P. Ramachandra Rao
MEMBER OF PARLIAMENT
(RAJYA SABHA)

#10, Lodhi Estate
New Delhi - 110 003
Ph : 011 - 24644656
Fax: 011 - 24642528

सत्यमेव जयते

క్రుంగుతున్న ఉత్తరాంధ్ర కు ప్రత్యేక ఆర్ధిక ప్యాకేజి విషయంలో గాని, (4) కరువుకాటకాలతో నిత్యం కునారిల్లే రాయలసీమకు ప్రత్యేక ఆర్ధిక ప్యాకెజీ విషయంలో గాని, (5) ఆర్ధిక బాధల నుంచి రాష్ట్రాన్ని కొంతమేరకు బయట పడవేయగల "ఆర్ధిక లోటు భర్తీ" విషయంలో గాని, (6) కడప స్టీల్ ప్లాంట్ విషయంలోగాని, (7) రాజధాని నిర్మాణానికి నిధుల విషయంలో గాని, (8) పోలవరం నిర్మాణం, నిధుల విషయంలో గాని, (9) విభజన చట్టం షెడ్యూల్ 9 , 10 లలో పేర్కొన్న వివిధ ఉమ్మడి ప్రభుత్వ సంస్థల ఆస్తుల విషయంలో గాని, (10) దుగరాజపట్నం పోర్ట్ విషయంలో గాని, (11) ఇంకా అనేక ఇతర విభజన చట్ట హామీల విషయంలో గాని - మనం సాధించినది ఏమిటి? అని ఒకసారి పరిశీలిస్తే - ఖచ్చితం గా ఇది మన వైఫల్యమే - దీనికి కారణం మన అనైక్యతే అనిపించక మానదు. మనలో మనం విమర్శించుకొంటూ, కేంద్రం పై వత్తిడి చేయకుండా ఉండడంతో - కేంద్రానికి కూడా మనపై నిర్లక్ష్యం ఏర్పడింది అని స్పష్టం అవుతున్నది. మన అనైక్యత కారణం గా సీమాంధ్ర భవిష్యత్ తరాలు నష్టపోతున్నాయి అనే విషయాన్ని కూడా మనం గుర్తించడం లేదోమోనని మనసు వ్యాకుల పడుతోంది.

జరిగినదానికి వగచి ప్రయోజనం లేదు. ఇప్పటికైనా కళ్ళు తెరుద్దాం. సీమాంధ్ర ప్రయోజనాలు కాపాడడానికి కలసి కట్టుగా, పార్టీలకు అతీతం గా కదులుదాం. " సంఘీభవించి ఎంతటి కార్యాన్ని అయినా సాధించ వచ్చు" అని నిరూపించిన మన తమిళ సోదరులను ఆదర్శం గా తీసుకొని, "గడ్డి పరకలు సైతం వెంటి గా ఏర్పడి మదపుటేనుగు ను బంధించు చున్నవన్న" మన తెలుగు కవి "చిన్నయ సూరి" ని మాటలను స్ఫూర్తిగా తీసుకొని కదులుదాం రండి. కేంద్రం పై పోరాటం చేద్దాం. మనకు న్యాయంగా రావలసినవి సాధించుకొందాం. ఈ విధమైన ఐకమత్యాన్ని మనం ఇప్పటికైనా ప్రదర్శించి మనకు రావలసినవి సాధించలేకపోతే భవిష్యత్తు లో మనం చరిత్ర హీనులుగా మిగిలి పోవడమే కాకుండా - మన భవిష్యత్ తరాలకు తీరని నష్టం చేసినవారం అవుతాము. గుర్తించండి.

కాబట్టి ఈ విషయంలో మీరు వెంటనే చొరవ తీసుకొని - మీ అపార రాజకీయ అనుభవాన్ని ఉపయోగించి - విభజన చట్ట హామీలు నెరవేర్చేలా కేంద్రంపై యుద్ధానికి ఒక కార్యాచరణ ప్రణాళిక ను ప్రకటించి - దీనికి నాయకత్వం వహించి - మనకు న్యాయంగా రావలసినవి అన్ని సాధించి - చరిత్ర లో ఒక మహోన్నత నాయకుడిగా నిలిచిపోతారని ఆశిస్తున్నాను. రాష్ట్ర ముఖ్య మంత్రి గా ఈ పోరాటం మీ నాయకత్వంలో జరిగితే, రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు, పత్రిక, టివి మాధ్యమాలు, వ్యవసాయ,పారిశ్రామిక, సినిమా, వైద్య, విద్య, క్రీడా, సేవ రంగాలలో ప్రముఖులతో పాటు, మేధావులు, ప్రజలు ముఖ్యంగా యువత, విద్యార్థులు మీకు తోడుగా వుంటారు. ఈ నెల చివరలో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అవుతున్నందున - ఈ లోపు ఈ కార్యాచరణను ప్రకటించి - వచ్చే పార్లమెంట్ సమావేశాలలోనే మన హక్కులను సాధించి - సీమాంధ్ర ప్రయోజనాలు కాపాడి - మీరు సీమాంధ్ర ప్రజల గుండెల్లో చిరస్థాయి గా తిరుగులేని నాయకుడిగా నిలిచిపోవడానికి ప్రయత్నిస్తారని ఆశిస్తూ..

అభినందనలతో

భవదీయుడు,

కె.వి.పి.రామచంద్ర రావు

(డా. కె.వి.పి.రామచంద్ర రావు)

శ్రీ నారా చంద్రబాబు నాయుడు,

గౌరవ ముఖ్యమంత్రి, ఆంధ్ర ప్రదేశ్.